# హైదరాబాద్‌లో రాహుల్ భారత్ జోడో యాత్రకు భారీ బందోబస్తు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్ర మంగళవారం హైదరాబాద్‌లో భారీ పోలీసు పహారా మధ్య వేడుకగా సాగింది. శివార్లలోని శంషాబాద్ నుంచి ఉదయం ఆరు గంటల సమయంలో రాహుల్ గాంధీ సహచర కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బెంగళూరు జాతీయ రహదారి మీదుగా గగన్‌పహాడ్, ఆరాంఘర్, శివరాంపల్లి, బహదూర్‌పురా, పురానాపూల్, మదీనా మీదుగా చార్మినార్‌కు చేరుకుని అక్కడ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం చార్మినార్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుంచి తిరిగి మదీనా, అఫ్జల్‌గంజ్, ఉస్మాన్‌గంజ్, మోజంజాహీ మార్కెట్, గాంధీ భవన్, నాంపల్లి, రవీంద్ర భారతి, ఇక్బాల్ మినార్, సచివాలయం చౌరస్తా, నెక్లెస్ రోడ్డు చౌరస్తా మీదుగా నెక్లెస్ రోడ్డు వరకు యాత్రను కొనసాగించి అక్కడే జరి గిన బహిరంగ సభలో పాల్గొన్నారు. కాగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు సైబరాబాద్ పోలీసులతో పాటు సిటీ పోలీసులు సంయుక్తంగా బందోబస్తు చేబట్టారు . హైదరాబాద్ వరకు వస్తే శివరాంపల్లి దాటిన తరువాత హసన్ నగర్ చౌరస్తా నుంచి హైదరాబాద్ పరిధిలోకి రావడంతో దక్షిణ మండల పోలీసులు ఈ యాత్ర సవ్యం గా సాగేలా అన్నిచోట్ల పోలీసులను భారీగా మోహరించారు.

యాత్రలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వుండేందుకు రాహుల్ గాంధీ వద్దకు ఎవరు దూ సుకు రాకుండా వుండేందుకుగానూ ఎస్‌పిజి కమెండోలకు తోడుగా అదనపు బలగాలను రంగంలో దించారు. ఈ యాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా త రలిరావడంతో పలుచోట్ల ట్రాఫిక్ జాం ఏర్పడింది. రాహుల్ గాంధీని నేరుగా చూసేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు రహదారులపై రావడంతో వారిని సముదాయించడ ం పోలీసులకు కష్టంగా మారింది. రోడ్లపై వచ్చిన వారిని వెనక్కు వెళ్లాలని పోలీసులు పదే పదే కోరినా ప్రజలు వెనక్కు తగ్గకుండా యాత్ర సాగే వరకు వున్నారు. కాగా రాహుల్ గాంధీ యాత్రలో ఆయా ప్రాంతాల నాయకులకు స్థానికంగా ప్రాముఖ్యత లభించింది. కొన్నిచోట్ల స్థానిక నాయకులతో రాహుల్ గాంధీ ముచ్చటించడంతో పా టు ఫోటోలు దిగారు. పలుచోట్ల చిన్నారులు, వయో వృద్దులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. యాత్రలో భాగంగా నెహ్రూ జూ పార్క్ వద్ద రాహుల్ గాంధీ వచ్చిన పుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఈ జూ పార్క్ ఏర్పాటు చేసినట్లు పలువురు గుర్తు చేశారు. ఇక నెక్లెస్ రోడ్ చౌరస్తాలో వున్న ఇందిరా గాంధీ విగ్రహం వ ద్ద రాహుల్ గాంధీ కొంతసేపు ఆగి తన నానమ్మ విగ్ర హాన్ని కొన్ని క్షణాల పాటు తిలకించారు. ఈ యాత్రకు మొదట దక్షిణ మండలం ఆ తరువాత మధ్య మండల పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ రెండు మండలాల పోలీసులకు తోడుగా ఇతర ప్రాంతాల పోలీసులను కూడా రంగంలో దించారు. బందోబస్తులో భాగంగా అన్నిచోట్ల పోలీసు జాగిలాల చేత తనిఖీలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బహి రంగ సభ జరిగిన నెక్లెస్ వద్ద పోలీసు పహారా భారీగా వుండడం గమనార్హం.



### భారీగా ట్రాఫిక్ జాం.. ఇతర మార్గాల్లో వాహనాల మళ్లింపు

### మెట్రో, ఎంఎంటిఎస్ రైళ్లను ఆశ్రయించిన ప్రయాణికులు

ఇదిలావుండగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన క్రమంలో యాత్ర సాగిన మార్గాలలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. మొదట శంషాబాద్ జాతీయ రహదారిపై ఆ తరువాత నగరంలోని పాతబస్తీలోని ఇంకొన్ని మార్గాలపై ఆ తరువాత నగరంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన అఫ్జల్‌గం జ్, మోజం జాహీ మార్కెట్, నాంపల్లి, రవీంద్ర భారతి మార్గంలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీని తరువాత రవీంద్ర భారతి, ఇక్బాల్ మినార్, సచివాలయం చౌర స్తా, నెక్లెస్ రోడ్ చౌరస్తా, నెక్లెస్ రోడ్ మార్గాలలోనూ ఇదే విధంగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.

అయితే ట్రాఫిక్ జాంలను ముందుగానే అంచనా వేసిన ట్రాఫిక్ పోలీసులు ఇందుకు అనుగుణంగా ఆయా మార్గాలలో వాహనాలను మళ్లించారు. వాహనదారులకు ఆయా ప్రాంతాల పోలీసులు సూచనలు చేస్తూ వారు సాఫీగా వెళ్లేందుకు సహకరిం చారు. కాగా ట్రాఫిక్ జాంలు వున్న ప్రాంతాల ప్రజలు తమ వాహనాలను బయటకు తీయకుండా మెట్రో, ఎంఎంటిఎస్ రైళ్లను ఆశ్రయించారు. దీంతో ఈ రెండు రవా ణా వ్యవస్థలు రద్దీగా కనిపించాయి. కాగా రాత్రి ఏడు గంటల సమయంలో రాహుల్ గాంధీ బహిరంగ సభ ముగియడంతో ఎనిమిది గంటల తరువాత ట్రాఫిక్ జాంల కు తెరపడింది.

# కారు ప్రమాదంలో సినీనటి రంభకు స్వల్పగాయాలు



న్యూఢిల్లీ, నవంబరు 1 : ప్రముఖ నటి రంభ కెనడాలో జరిగిన ఓ కారు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు. ఆమెతో పాటు ఆమె ఇద్దరు కూతుళ్లు, ఆమె నానీకి స్వల్ప గాయాలయ్యాయి. చిన్న కూతురు సాషా ఇంకా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కాలేదని ఆమె ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తెలియ జేశారు. సంబం ధించిన ఫోటోలను షేర్ చేశారు. సోమవారం సాయంత్రం తన కూతుళ్లను స్కూల్ నుంచి తీసుకొస్తుండగా ఓ జంక్షన్ దగ్గర తన కారుని మరో కారు ఢీకొట్టిందని రంభ తెలియజేశారు. అందరికీ స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడం వల్ల పెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో చూసిన ఆమె అభిమానులు స్పందించారు. ఆమె, ఆమె పిల్లలు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. రంభ 1990ల నుంచి పలు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించారు. రజినీకాంత్,విజయ్, సల్మాన్‌ఖాన్, చిరంజీవి, మమ్ముట్టిలాంటి అగ్ర సినీ హీరోలతోనూ ఆమె నటించారు. 2010లో కెనడాలో స్థిరపడిన ఇంద్రకుమార్ అనే వ్యాపారవేత్తను వివాహమాడారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నాడు. వివాహం తర్వాత ఆమె సినిమాలకు దూరమయ్యారు.

# నేటి నుంచి 15 బిసి స్టడీ సర్కిళ్లలో ఎస్ఐ, పిసి అభ్యర్థులకు మెయిన్స్ కోచింగ్

## స్టడీ సర్కిల్ డైరెక్టర్ అలోక్‌కుమార్

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా 15 బీసీ స్టడీ సర్కిల్స్‌లో నేటి(బుధవారం) నుంచి ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్స్ అభ్యర్థులకు ఉచిత మెయిన్స్ కోచింగ్‌ను ప్రారంభించనున్నట్టు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్స్ డైరక్టర్ కె అలోక్ కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 బీసీ స్టడీ సర్కిల్స్‌లో కోచింగ్ తీసుకొని ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఫిజికల్ టెస్ట్, మెయిన్స్ పరీక్షలకు 1237 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్టు అలోక్ కుమార్ తెలిపారు. 2022 ఆగస్టులో జరిగిన ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినందుకు రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ, మరియు పోలీస్ కానిస్టేబుల్ కోసం కంబైన్డ్(ఫిజికల్ టెస్ట్ మరియు మెయిన్స్ ఎగ్జామ్ కోసం) ఉచిత కోచింగ్‌ను 15 బీసీ స్టడీ సెంటర్స్‌లో ఒక్కొక్క దానిలో 100 మంది చొప్పున ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. నేటి నుంచి ఉచిత కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం స్టడీ సర్కిల్స్‌లో 250 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, నల్గొండ, జోగులాంబ గద్వాల్, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, రాజన్న సరిసిల్ల, మరియు 3 స్టడీ సెంటర్లు నిర్మల్, జగిత్యాల, సిటీ కాలేజ్(హైదరాబాద్)లో 90 రోజులపాటు లేదా మెయిన్స్ పరీక్ష తేది వరకు ఏది ముందుగా ఉంటే అది.. బీసీ స్టడీ సర్కిల్స్, స్టడీ సెంటర్స్‌లో ఎస్ఐ ఆఫ్ పోలీస్ మరియు పోలీస్ కానిస్టేబుల్స్ ప్రిలిమ్స్ కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు నేరుగా రాష్ట్రంలోని సంబంధిత బీసీ స్టడీ సర్కిల్స్‌లో ప్రవేశం పొందుతారని తెలిపారు. ప్రిలిమ్స్‌కు అర్హత సాధించి, బీసీ స్టడీసర్కిల్స్‌లో కోచింగ్ తీసుకోని అభ్యర్థులు కూడా ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని అలోక్ కుమార్ తెలిపారు. మెరిట్ మరియు రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు టీఎస్ బీసీ స్టడీ సర్కిల్స్, టీఎస్ బీసీ స్టడీ సెంటర్స్‌లలో దేనిలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని డైరక్టర్ అలోక్ కుమార్ స్పష్టం చేశారు.

# ఎపిఆర్డీఎస్ కుడికాలువ పనులు కొనసాగిస్తోంది

## కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ లేఖ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1: కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం మరోమారు లేఖ రాసింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డ్ ఇంకా అమల్లోకి రాక ముందే ఏపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ పనులు కొనసాగిస్తోందని అభ్యంతరం వ్యక్తం చేసింది.గతంలో అనేకసార్లు లేఖలు రాసినప్పటికీ తగిన విధంగా స్పందించలేదని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కెఆర్ఎంబీ ఛైర్మన్‌కు ఈఎన్సీ మురళీధర్ లేఖ రాశారు. ఏపీ ఇప్పుడు ఏకంగా డిపీఆర్‌ను కేంద్ర జల సంఘానికి సమర్పించిందన్న తెలంగాణ,ట్రిబ్యునల్ విచారణ పూర్తయ్యే వరకు,కేసులు పరిష్కారం అయ్యే వరకు డిపిఆర్ పరిశీలన నిలిపివేయాలని విజ్ఞప్తి చేసింది.

# టెలిగ్రాఫ్ ఉద్యోగుల సహకార సంఘం నిధులు కాజేసిన నిందితుడికి జీవిత ఖైదు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్ర టెలిగ్రాఫ్ ఉద్యోగుల సహకార పరపతి సంఘం నిధులను కాజేసిన మాజీ కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తికి నాంపల్లి కోర్టు జీవిత ఖైదు శిక్షతో పాటు లక్ష రూపాయల పరిమానా విధించింది. నగరంలోని కోఠిలో గల టెలిగ్రాఫ్ ఉద్యోగుల సహకార పరపతి సంఘం 2008లో 52 కోట్ల రూపాయలకు పైగా నిధులు గోల్‌మాల్ అయినట్లు సిసిఎస్‌లో ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై విచారించిన సిసిఎస్ పోలీసులు ఆరా తీయగా గోల్‌మాల్ అయిన నిధులు 52 కోట్ల 45 లక్షల 85 వేల 868 రూపాయలుగా తేల్చారు. ఈ గోల్‌మాల్‌కు సూత్రధారిగా సంఘం అప్పటి కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తిగా తేల్చారు.

# అంతా గప్‌చుప్

≫ పోలింగ్‌లో మునుగోడు తదుపరి శాసనసభ్యుడిని నియోజవర్గ ప్రజలు ఎన్నుకోనున్నారు. ఎన్నికల ప్రచారం ముగిసినందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి స్థాయిలో ఎన్నికల నిబంధనలు పాటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత బయటి వారు ఎవరూ నియోజకవర్గంలో ఉండకుండా అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో ఎస్సెమ్మెస్‌లపై నిషేధం ఉందని, సోషల్ మీడియాల్లోనూ ప్రచారం చేయరాదని సీఈవో తెలిపారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలో మొత్తం 2 లక్షల41 వేల 855 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు లక్షా 21వేల 662 మంది, మహిళలు లక్షా 20వేల 126 మంది ఉన్నారు. 5686 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నప్పటికీ కేవలం 739 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. గురువారం (నవంబర్ 3న) ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. నియోజకవర్గంలో మొత్తం 298 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉప ఎన్నిక బరిలో 47 మంది అభ్యర్థులు నిలిచారు. నోటా కలిపి ఒక్కో ఈవీఎంలో మూడు బ్యాలెట్ యూనిట్లు అవసరం. ఇందుకోసం 1192 బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేశారు. కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను 596 చొప్పున అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఉండే అవసరాలతో పాటు 10 శాతం అదనంగా సిద్ధం చేసి ఉంచారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్,ముగ్గురు ఆఫీసర్లు ఉంటారని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. 3,366 మంది రాష్ట్ర పోలీసు సిబ్బందితో పాటు 15 కంపెనీల కేంద్ర బలగాలు విధుల్లో ఉంటారని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికకు 298 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 105 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని వికాస్ రాజ్ తెలిపారు.ఇప్పటి వరకు వివిధ రూపాల్లో ఇప్పటి వరకు 479 ఫిర్యాదులు వచ్చాయని, 185 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో ఇప్పటి వరకు రూ.6 కోట్ల 80లక్షల నగదు, 4,500 లీటర్లకు పైగా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వికాస్‌రాజ్ వివరించారు. 111 బెల్ట్ షాపులను మూసివేసినట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు,పర్యవేక్షణ కోసం 7 మండలాలు,2 మున్సిపాలిటీలకు ఒకటి చొప్పున 9 బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 51 బృందాలు పర్యవేక్షణలో ఉండనున్నాయి. ప్రలోభాల పర్వాన్ని నిరోధించేందుకు ఈసీ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. నియోజకవర్గ పరిధిలో, సమీప ప్రాంతాల్లో 100 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

# కెటిఆర్ వర్సెస్ రేవంత్ ట్విట్టర్ వార్

**ముందు అమేథీలో గెలువు.. రాహుల్‌పై కెటిఆర్ ట్వీట్**

**కన్న కూతురునే గెలిపించుకోలేని మీరు జాతీయ నాయకులా.. కెటిఆర్‌కు రీట్వీట్ చేసిన రేవంత్**

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: మంత్రి కెటిఆర్ వర్సెస్ పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మధ్య ట్విట్టర్‌లో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. తెలంగాణలో సిఎం కెసిఆర్ జాతీయ పార్టీ పెట్టడాన్ని విమర్శిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి కెటిఆర్ ట్విట్టర్‌లో స్పందించారు. అంతర్జాతీయ నేత రాహుల్ గాంధీ తన సొంత పార్ల మెంటు నియోజక వర్గం అమేథీలోనే గెలవలేకపోయారంటూ విమర్శించారు. జాతీయ పార్టీ ఆశయా లతో ముందుకు వెళ్తున్న సిఎం కెసిఆర్‌ను విమర్శించే హక్కు రాహుల్‌కు లేదని మంత్రి అన్నారు. ప్రధానమంత్రి కావాలనుకుంటున్న రాహుల్‌గాంధీ ముందుగా ప్రజలను ఒప్పించి సొంత నియోజకవర్గంలో ఎంపిగా గెలవాలంటూ సెటైర్ వేశారు. మంత్రి కెటిఆర్ ట్వీట్‌కు రేవంత్‌రెడ్డి రీట్వీట్ చేస్తూ కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీని విమర్శిస్తూ చేసిన ట్వీట్‌కు కౌంటర్ ఇచ్చారు. కన్నకూతురునే ఎంపిగా గెలిపించుకోలేని మీరు జాతీయ నాయకుడినని డబ్బా కొట్టుకుంటున్న నేత. మీ రాజకీయ జీవితం కూడా ఓటమితోనే మొదలైందన్న సంగతి గుర్తుందా అంటూ ట్వీట్ చేశారు. 'ఎవరన్నా గుర్తు చేయండ్రా బాబూ' అంటూ సెటైర్ వేశారు. డ్రామారావు అనే హ్యాష్ ట్యాగ్‌ను జతచేస్తూ కెటిఆర్ ట్వీట్‌ను రేవంత్ రీట్వీట్ చేశారు.

# బాలుడి మర్మావయవాలపై కొందరు టపాసులు కాల్చారు!

## వేధింపులకు గురిచేశారని యుపి పోలీసులకు ఫిర్యాదు

## విచారణకు రంగంలోకి దిగిన పోలీసులు

మేడ్చల్, నవంబరు 1, ప్రభాతవార్త: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఖుషీనగర్‌కు చెందిన 16 యేళ్ల ఓ బాలుడిని పట్టుకుని మార్మాంగాలపై కొందరు టపాసులు పేల్చి వేధింపులకు గురి చేశారని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు అందినట్లు అక్కడి పోలీసులు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. అయితే ఈ విషయం సోషల్ మీడి యాలో వైరల్‌గా మారింది. అయితే ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చిన ఆ యువకుడుపై కొందరు ఈ దారుణానికి పాల్పడటం జరిగినట్లు సమాచారం. ఈ విషయంపై మేడ్చల్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాసరగడిలోని టపాసుల కర్మాగారంలో పనిచేసేందుకు వారి బంధువులు మూడు నెలల క్రితం పంపించినట్లు కొన్ని రోజుల నుంచి ఆ బాలుడిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు స్థానికంగ కొందరు యువకులు ఈ దారుణానికి పాల్పడినట్లు, బాలుడిని పట్టుకుని కదలకుండా గట్టిగ పట్టుకుని యువకులు ఇబ్బందులకు గురిచేశారని, వదిలిపెట్టాలని ఆ బాలుడు ఏడుస్తూ బతిమాలినా కనికరించలేదని తెలుస్తుంది. అయితే మార్మాంగాలపై టపాసులు పేలుస్తూ వీడియో తీసి పైశాచికానికి పాల్పడినట్లు, తరువాత విడియోను మద్యామాల్లో వైరల్ చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారటం జరిగింది. బాధితుడి సెల్‌ఫోన్ కూడ వారు లాక్కునట్లు సమాచారం. అయితే వైరల్‌గా మారిన ఈ విడియో ద్వారా సమాచారం తెలుసు కున్న బాధితుడి తల్లిదండ్రులు స్పందించి వెంటనే ఈ ఘటనపై యూపిలోని ఖుషినగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, అక్కడి పోలీసులు మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు ఈ కేసుకు సంబంధించి విచారణకు రంగంలోకి దిగినట్లు చెప్పవచ్చు. అయితే తమకుమారుడు మానసికవైకల్యంతో ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు చెప్పారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై మేడ్చల్ పోలీసులు కేసును చేధించటానికి ఆ కర్మాగారం కోసం ఆ బాలుని ఆ చూకి కోసం మేడ్చల్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు చెప్పవచ్చు.ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారటంతో పోలీ సులు విచారణకు రంగంలోకి దిగినట్లు, అన్వేషిస్తున్నట్లు రాత్రి వరకు ఆ చూకి లభించలేదని మేడ్చల్ పోలీసులు తెలిపారు. యుపి పోలీసుల సమాచారం మేరకు మేడ్చల్ పోలీసులు కేసును విచారణకు రంగంలోకి దిగారని చెప్పవచ్చు.

# టాలీవుడ్‌కు బ్రిటన్ సహకారం

## బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్‌తో మెగాస్టార్ చిరంజీవి భేటీ



హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) గారెత్‌విన్ ఓవెన్‌తో సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి భేటీ అయ్యారు. అహ్వానం మేరకు హైదరాబాద్‌లోని చిరంజీవి ఇంటికి మంగళవారం వెళ్లిన డిప్యూటీ హై కమిషనర్ అక్కడే భోజనం చేశారు. చిరంజీవితో కలిసి పలు విషయాలపై చర్చించినట్లు వీరి మధ్య చర్చకు వచ్చింది. ఈ భేటీలో ప్రధానంగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలకు యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వ సహకారం అందించడంపై ఇరువురు చర్చించారు. చిత్ర పరిశ్రమకు సహకరించేందుకు ఎటువంటి గారెత్ విన్ ఆసక్తి చూపించారు. ఈ మేరకు వారి భేటీకి సంబంధించిన ఫొటోలను గారెత్ విన్ ట్విట్టర్‌లో షేర్ చేశారు. కరోనా సమయంలోనే కాకుండా గత కొన్నేళ్లుగా చిరంజీవి విస్తారమైన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలపై ప్రశంసించారు. రానున్న రోజుల్లో కలిసి పని చేయడానికి ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. ఇంకా పలు విషయాలను గూర్చి చర్చించినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో తెలియచేయనున్నట్లు చెప్పారు.

### ఆవకాయ అదుర్స్: చిరంజీవి

చిరంజీవి, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ కలిసి డిన్నర్ చేశారు. ఇందులో ప్రధానంగా ఆవకాయ టేస్ట్ అదుర్స్ అని గారెత్ విన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు చిరంజీవి ట్విట్టర్‌లో చేసిన ట్విట్ అందరినీ ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌కు కొత్తగా వచ్చిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్‌ను డిన్నర్‌కు పిలిచినట్లు చిరంజీవి పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయనతో కలిసి దిగిన ఫొటోలను చిరంజీవి షేర్ చేశారు. అలాగే గారెత్ విన్‌తో మెగాస్టార్ కలిసి సంభాషణ, డిన్నర్‌కు సంబంధించిన ఫొటోలోను కూడా పోస్ట్ చేశారు. ఈ డిన్నర్‌లో గారెత్ విన్‌కు మన తెలుగు సంప్రదాయ వంటకాలను రుచి చూపించారు. తెలుగు తనానికి ప్రతీకగా నిలిచే ఆవకాయ టేస్ట్‌ను కూడా చూపించినట్లు చిరంజీవి తెలిపారు. బ్రిటీష్ హై కమిషనర్ గారెత్ విన్‌ను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ట్విట్‌లో పేర్కొన్నారు. ‚ఎన్నో అంశాల మీద మేము చర్చించుకున్నాం. ఇండియా, బ్రిటన్ సంబంధాలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధి ఇలా పలు విషయాల మీద మేము మా ఇంట్లో చర్చించుకున్నాం. అంతే కాకుండా మన తెలుగు వంటకాలను ఆయనకు రుచి చూపించాం. సుప్రమనే ఆవకాయ్‌ను మరచిపోకుండా వడ్డించాం' అని చిరంజీవి ట్విట్ చేశారు.

# మునుగోడులో ఆశ్చర్యకరమైన మెజారిటీతో గెలుస్తాం: మంత్రి కెటిఆర్

పభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 1: మునుగోడులో మోసగాళ్లకు,మొనగాళ్లకు మధ్య పోటీ జరుగుతుందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. నల్లచట్టాలతో రైతులు,జిఎస్టీతో చేనేత కార్మికులకు బిజెపి సర్కార్ అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మునుగోడులో ఇప్పటి వరకు ఏం చేశామో, రానున్న రోజుల్లో ఏం చేస్తామో చెబుతూ ప్రచారం నిర్వహించామన్నారు. కానీ మునుగోడులో మాత్రం చెప్పుకొనేందుకు బిజెపికి ఏమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఏళ్ల తరబడి ఉన్న ఫ్లోరోసిస్ సమస్యకు కూడా తమ ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. సోమవారం తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్‌పై బిజెపి నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. మంగళవారం పలివెలలో తమ పార్టీకి చెందిన నేతలపై దాడులకు దిగాయన్నారు.బిజెపి ఉద్దేశ్యపూర్వకంగా దాడులు చేసిందని విమర్శించారు.

# నిరుద్యోగ యువతకు సింగరేణి ఉచిత డ్రైవింగ్ శిక్షణ

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ సింగరేణి కాలరీస్ యాజమాన్యం నిర్ణయించింది. సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఈ అవకాశాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు దీనికి సంబంధించి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్) అనే సంస్థతో సింగరేణి యాజమాన్యం తాజాగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సింగరేణి జనరల్ మేనేజర్ కె సూర్యనారాయణ, ట్రైడ్స్ సంస్థ సెక్రటరీ నుంజుమ్ రియాజ్ ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత భోజన వసతితో నెల రోజు పాటు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంఓ 100 మంది నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

ఇందు కోసం సింగరేణి సామాజిక బాధ్యత నిధుల నుండి 25 లక్షల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ఈ నెలలో మొదటి బ్యాచ్‌లో 25 మందికి శిక్షణ ఇప్పి స్తున్నామని వివరించారు. ఈ అవకాశాం సింగరేణి ప్రాంతంలోని పీఏఎఫ్, పీడీఎఫ్, ఉద్యోగుల పిల్లలు, విశ్రాంత ఉద్యోగుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పేర్లను ఏరియాలోని సింగరేణి సేవా సమితి కో ఆర్డినేటర్ లేదా కో ఆర్డినేటింగ్ ఆఫీసర్‌కు తెలియచేయాలన్నారు.

# నేటి నుంచి లాసెట్ కౌన్సెలింగ్

## 12 వరకు దరఖాస్తుకు అవకాశం

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్రంలోని 3సంవత్సరాల లా కోర్సుతోపాటు.. 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు, పీజీ లా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన లాసెట్, పీజీలాసెట్-2022 కౌన్సెలింగ్ నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం జారీ చేశారు. నేటి నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు.స్పెషల్ కేటగిరికి చెందిన వారికి నవంబర్ 14 నుంచి 16 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టను న్నారు. ఈ నెల 17న అర్హత కలిగిన అభ్యర్థుల లిస్టును ప్రకటించి.. అర్హతలున్న అభ్యర్థుల లిస్టులో తప్పులు ఉంటే సరిదిద్దుకోవడానికి మెయిల్ ద్వారా అవకాశం కల్పించనున్నారు.

# టిఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రలోభం కుట్ర కేసు

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన ముగ్గురు నిందితులు

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన టిఆర్ఎస్ ఎంఎల్ఎలను ప్రలోభపెట్టేందుకు జరిగిన కుట్ర కేసులో నిందితులుగా వున్న రామ చంద్రభారతి, సింహయాజులు, నందకుమార్ మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమపై నమోదైన ఎంఎల్ఎలను ప్రలోభపెట్టేందుకు జరిగిన కుట్ర కేసును కొట్టి వేయాలని, ఇదే సమయంలో తెలంగాణ ఎసిబి కోర్టు తమను రిమాండుకు తరలించడాన్ని కూడా కొట్టివేయాలని వారు సుప్రీం కోర్టును కోరారు. తమ అరెస్టు పూర్తిగా అక్రమమని, ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను నిలుపుదల చేయాలని వారు కోరారు.

నగర శివార్లలోని మొయినాబాద్‌లో గల తాండూరు ఎంఎల్ఏ పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్ లో అక్టోబర్ 26వ తేదీన నలుగురు తెరాస ఎంఎల్ఎలను బిజెపిలో చేరేందుకు వీలుగా రామచంద్రభారతి, సింహయాజులు, నందకుమార్‌లు రోహిత్ రెడ్డితో మంతనాలు సాగించడం, దీనిపై రోహిత్ రెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ వ్యవహారం రట్టవడం తెలిసిందే. దీనిపై మొయినాబాద్ పోలీసులు రామచంద్ర భారతి, సింహయాజులు, నందకుమార్‌లను అరెస్టు చేసి మరుసటి రోజున ఎసిబి కోర్టులో హాజరుపరచగా నిందితులకు రిమాండు విధించేందుకు న్యాయమూర్తి తిరస్కరించడం విదితమే. దీనిపై సైబరాబాద్ పోలీసులు హైకోర్టును ఆశ్రయించి మరీ ముగ్గురిని రిమాండుకు తరలించారు. ముగ్గురు నిందితులు ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వున్నారు. కాగా తమపై సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని రామచంద్ర భారతి, సింహయాజులు, నందకుమార్‌లు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ఈ నెల నాలుగవ తేదీన విచారణ చేయనున్నట్లు తెలిపింది. మరోవైపు ఈ కేసులో తమకు బెయిలు మంజూరు చేయాలని రామచంద్ర భారతి, సింహయాజులు, నందకుమార్‌లు రంగారెడ్డి జిల్లా ఎసిబి కోర్టులో మంగళవారం నాడు బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఎసిబి కోర్టు దీనిపై విచారణను ఈ నెల ఏడవ తేదీకి వాయిదా వేసింది.

### నిందితులను కస్టడీ కోరనున్న పోలీసులు

ఇదిలావుండగా టిఆర్ఎస్ ఎంఎల్ఎల ప్రలోభపెట్టేందుకు జరిగిన కుట్ర కేసులో నిందితు లుగా వున్న రామచంద్ర భారతి, సింహయాజులు, నందకుమార్‌లను మరిం తగా విచారిం చేందుకు వీరిని కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. ముగ్గురిని కనీసం వారం రోజుల పాటు విచారిస్తే ఈ కేసులో మరిన్ని విషయాలు వెలు గులోకి వస్తాయని వారు భావిస్తున్నారు. దీనిపై రెండు మూడు రోజుల్లో పోలీసులు ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేసే వీలుంది.

# మునుగోడు ఉప ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్న సిఎం: తరుణ్‌చుగ్

హైదరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త: మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో కెసిఆర్ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడుతుందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తుందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ విమర్శించారు. ప్రజాస్వామ్య గొంతుకను అణచివేసే కెసిఆర్ ప్రభుత్వ చర్యలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో పనిచేస్తున్న బిజెపి నేతల ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారన్నారు. ఇది చాలా చట్టవిరుద్ధమని, తీవ్ర నేరమని స్పష్టంచేశారు. చట్టపరమైన ప్రక్రియ లేకుండా ఎవరి టెలిఫోన్ అయినా ట్యాప్ చేయడానికి చట్టం అనుమతించదని పేర్కొన్నారు. బిజెపి నేతలు ఫోన్‌లు అక్రమంగా ట్యాప్ చేయడం చట్టాన్ని దుర్వినియోగం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో ఎలాంటి ఆధారాలు లేకున్నా బిజెపిపై తప్పుడు ఆరోపణలు గుప్పిస్తూ, బిజెపిని బదనాం చేయడానికి ఓటరర్లను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

